క్లుప్తంగా

బాలత్రిపుర సుందరీదేవికి ప్రత్యేక పూజలు

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో వెలసిన బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, పూజలు, భజనలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన విశ్రాంత ఉద్యోగులు

నాయుడుపేట టౌన్: తహసీల్దార్‌గా బాధ్యతలను చేపట్టిన గీతావాణిని స్థానిక విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకుడు చేవూరు చెంగయ్య తదితరులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్రాంత ఆర్ఐగా పనిచేసిన చెంగయ్య పలు రెవెన్యూ పరమైన సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి పలు రెవెన్యూ సమస్యలను సైతం ఆమె దృష్టికి తీసుకెళ్లారు.

గర్భవతులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

సైదాపురం: నెలకు ఒక్క రోజు గర్భవతులకు అన్ని వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రావణి తెలిపారు. మండల కేంద్రమైన సైదాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన అభియాన్ కార్యక్రమం ద్వారా శుక్రవారం గర్భవతులకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న సుమారు 35 మందికిపైగా గర్భవతులు వైద్య పరీక్షల కోసం విచ్చేశారు. ఈ సందర్భంగా గర్భవతులు, బాలింతలకు రక్తహీనత నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ వివరించారు.

టార్పాలిన్ పట్టలు, డ్రమ్ములు పంపిణీ

దొరవారిసత్రం: ఏకొల్లు, తల్లంపాడు, తనియాలి తదితర గ్రామాల్లోని రైతులకు శుక్రవారం డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేసినట్లు ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ షబీనాబేగం తెలిపారు. ఈ డ్రమ్ములను ద్రవ జీవామృతం, ఘన జీవామృతం తయారీకి వినియోగించుకోవాలని రైతులకు తెలియజేశారు. డీవీ సత్రం మండలానికి 172 యూనిట్లు మంజూరు కాగా ప్రతి రైతుకు అందజేసినట్లు ఆమె తెలియజేశారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చంద్రకళ పాల్గొన్నారు.

ఈశ్వరాలయం జీర్ణోద్ధరణకు భూమి పూజ

నాయుడుపేట టౌన్: పుదూరు గ్రామ సమీపంలో శిథిలావస్థలో ఉన్న ప్రణవ బ్రహ్మసూత్ర ఈశ్వరాలయం జీర్ణోద్ధరణకు శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. శుక్రవారం ఆలయం వద్ద వేదపండితులు ప్రత్యేక హోమ పూజలను నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులతోపాటు గ్రామ పెద్దలు ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. దాతల చొరవతో ఆలయ నిర్మాణ పనులను చేపడుతున్నట్లు నిర్వాహకులు అల్లాకుల మనోజ్, చాగణం సుమన్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో షేక్ రఫీ, ఇండ్ల చంద్రయ్య, పుదూరు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేడుకగా అంకాళమ్మ గ్రామోత్సవం

కోట: శ్యాంసుందరపురంలో అంకాళ పరమేశ్వరి అమ్మవారి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శుక్రవారం అమ్మవారి గ్రామోత్సవం భక్తుల జయజయధ్వానాల మధ్య వైభవంగా నిర్వహించారు. నూతనంగా ప్రతిష్టించనున్న అమ్మవారి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం కోసం కేవీకే కృషి


బిస్కెట్ల తయారీపై కరపత్రాల ఆవిష్కరణ

వెంకటగిరి(సైదాపురం): రైతులకు సాంకేతిక పద్ధతులతో ఆధునిక వ్యవసాయం అందించే దిశగా కృషివిజ్ఞాన కేంద్రం పని చేస్తుందని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి కరుణ పేర్కొన్నారు. పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.గోవిందరాజులు ఆధ్వర్యంలో శుక్రవారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయం విస్తరణ అధికారి కరుణ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు దేశవ్యాప్తంగా 732 ఉన్నాయన్నారు. కృషివిజ్ఞాన కేంద్రాలు దేశంలో స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం గ్రామీణ రైతులు, మహిళలకు వ్యవసాయ అనుబంధ రంగాల నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నామన్నారు. అనంతరం నాబార్డ్ సహకారంతో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ మహిళలకు చిరుధాన్యాలు, మునగాకుతో బిస్కెట్ల తయారీ శిక్షణను ప్రారంభించారు. నాబార్డ్ ఏజీఎం సునీల్, మెప్మా పీడీ రాధమ్మ, సతీష్ పాల్గొన్నారు.

గంగ నీరు చెరువులకు చేరేనా?



చందనముడి, కల్లూరు గ్రామ సమీపంలో 14ఆర్ మేజర్ కాలువపై దెబ్బతిన్న బ్రిడ్జిలు, మినమనముడి వద్ద ముళ్ల చెట్లతో మూసుకుపోయిన గంగ కాలువ

- తెలుగు గంగ బ్రాంచి కాలువపై దెబ్బతిన్న కాంక్రీట్ నిర్మాణాలు
- ముళ్ల చెట్లతో మూసుకుపోయిన కాలువలు

దొరవారిసత్రం: తెలుగు గంగ 14ఆర్ మేజర్ కాలువ, సప్లయ్ ఛానల్స్ ముళ్ల చెట్లతో మూసుకుపోయాయి. దీంతో మండల పరిధిలోని మెట్ట రైతులు, చెరువుల్లోకి తెలుగు గంగ జలాలు సరఫరా కావడం లేదు. దీంతో రైతులు పంట నష్టపోయే పరిస్థితి తలెత్తుతోంది. పలు ప్రాంతాల్లో కాలువలపై బ్రిడ్జీ నిర్మాణాలు, యూటీలు, లైనింగ్ పనులు వంటి వాటిని కాంక్రీట్‌తో నిర్మించారు. ఇవి కొన్ని ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరాయి. నెలబల్లి గ్రామ సమీపంలో తెలుగు గంగ 7వ మెయిన్ బ్రాంచి కాలువ నుంచి తెలుగు గంగ 14ఆర్ కాలువ మొదలై నెలబల్లి, నెల్లూరుపల్లి, నేలపట్టు, ఆనేపూడి, కల్లూరు, గొల్లపాళెం, చందనముడి తదితర గ్రామాలను కలుపుతూ సూళ్లూరుపేట మండలంలోని పలు గ్రామాల వరకు సుమారు 25 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఈ కాలువ నుంచి డీవీ సత్రం మండలంలోని 44 చెరువులకు గంగ జలాలు సులువుగా వెళ్లేలా సప్లయ్ ఛానల్స్‌ను తీశారు. 14ఆర్ మేజర్ కాలువతో పాటు సప్లయ్ ఛానల్స్ చెట్లు, ముళ్లపొదలతో మూసుకుపోయి దారుణంగా దర్శనమిస్తున్నాయి. అంతేకాకుండా ఈ కాలువలపై పలు ప్రాంతాల్లో నిర్మించిన కాంక్రీట్ నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. తెలుగు గంగ నీళ్ల చెరువులకు చేరకముందే కాలువల స్వరూపం మారిపోతూ కాంక్రీట్ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. గంగ జలాలు చెరువులకు చేరవేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర రుణ మాఫీ చేయాలి



పోస్టాఫీస్ ఎదుట నిరసన

గూడూరు రూరల్: రైతులకు సమగ్ర రుణ మాఫీ చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ ఎదురుగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. క్విట్ కార్పొరేట్ అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుని పోయేందుకు సిద్ధమవుతున్నామని అన్నారు. నాయకుడు జోగి శివ కుమార్ మాట్లాడుతూ రుణమాఫీ, పంటల బీమా, రైతుల, వ్యవసాయ కార్మికులు పెన్షన్ విధానంతో పాటు ద్యుత్ ప్రైవేటీకరణ వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు రుణ భారం తగ్గించి ఆత్మహత్యలకు ముగింపు పలికాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, వెంకటరామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, చంద్రయ్య, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం పలుకుదాం



వెంకటగిరి రూరల్: ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధన దిశగా ఢిల్లీకి వెళ్లి విజయం సాధించుకుని హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణమాదిగకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలుకుదామని నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లిపాటి రవిమాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని చెలికంపాడు గ్రామంలో శుక్రవారం కార్యకర్తలతో సమీక్షించారు. ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు మణి, రత్నయ్య, గోపాల్, రామయ్య, సోమయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


చందనం అలంకారంలో వ్యూహలక్ష్మీ అమ్మవారు, ప్రత్యేక అలంకరణలో శ్రీవేంకటేశ్వర స్వామివారు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని వళ్లీ దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగ పంచమి, గరుడ పంచమి సందర్భంగా ఆలయంలోని నాగేంద్ర స్వామి, గరుడాళ్వార్(గరుత్మంతుడు) విగ్రహాలకు పంచామృతాభిషేక పూజలు చేపట్టా. అదే విధంగా వ్యూహాలక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మేనకూరులో అధికారుల పర్యటన

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మేనకూరు పరిశ్రమల కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఏపీఐఐసీ అధికారులతో కలిసి మేనకూరు పరిశ్రమల కేంద్రంలో ఏర్పాటు చేసి ఉన్న పరిశ్రమల వివరాలను జోనల్ మేనేజర్లు మ్యాప్‌లను చూపించి వివరించారు.

ఈఎస్ఐ వైద్యశాల ఏర్పాటు చేయాలని వినతి

నాయుడుపేటలో ఈఎస్ఐ వైద్యశాల లేకపోవడంతో కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు డెల్టా బయో ఫార్మా పరిశ్రమ హెచ్ఆర్ కుమార్, బిర్లా కార్బన్ పరిశ్రమ ప్రతినిధులు కలిసి కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. నాయుడుపేట, మేనకూరులో ఈఎస్ఐ వైద్యశాల ఏర్పాటు చేయాలని పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యదర్శి వెంట ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, మేనకూరు జెడ్ఎం విజయ రత్నం తదితర అధికారులు ఉన్నారు.

ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి


అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ అధికారులు

పెళ్లకూరు: పాత, మొండి బకాయిల చెల్లింపుల కోసం వన్‌టైం సెటిల్‌మెంట్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ జోనల్ ఆఫీసర్ వల్లూరు శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం చెంబేడు గ్రామంలో వినియోగదారుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ నుండి రెండు, మూడేళ్ల కిందట రుణాలు పొంది, తిరిగి చెల్లించలేని వినియోగదారులు వన్‌టైం సెటిల్‌మెంట్ చేసుకొని విముక్తి పొందవచ్చన్నారు. అలాంటి వినియోగదారులకు కొత్తగా రుణాలు కూడా మంజూరు చేస్తామన్నారు. చిరు వ్యాపారులు, రైతులకు యూనియన్ బ్యాంక్ నుండి రుణాలు విరివిగా అందిస్తున్నట్లు వివరించారు. మేనేజర్ రాజశేఖర్, మహీధర్, కిరణ్, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

రాపూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని పొదలకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శివ నాయక్ పేర్కొన్నారు. గోనుపల్లి గ్రామంలో శుక్రవారం ముళ్లేశ్వరమ్మ పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను జీవామృతంతో విత్తన శుద్ధి చేసి ఎకరా పొలంలో చల్లి 40రోజుల తరువాత దుక్కిదున్నితే భూమి సారవంతంగా మారుతుందన్నారు. ఆ తరువాత కావాల్సిన పంటను వేసుకుంటే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని సూచించారు. మండలంలోని రైతులు రసాయనిక ఎరువులు వినియోగించుకోకుండా ఇలా చేస్తే అధిక ఆదాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ సోమసుందరం, ప్రకృతి వ్యవసాయ మేనేజర్ మునిరత్నం, సుబ్బయ్య, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శ్రీఆదిలక్ష్మీదేవికి ఆస్థాన సేవ


పెంచలకోనలో ఆదిలక్ష్మిదేవికి ప్రాకారోత్సవం

రాపూరు: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన శ్రీఆదిలక్ష్మిదేవికి శుక్రవారం ఆస్థానసేవ, ప్రాకారోత్సవం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రావణమాసంలో మొదటి శుక్రవారం కావడంతో ఆదిలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని అమ్మవారి ఆలయం ముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో తిరుచ్చిపై కొలువుదీర్చారు. వివిధ రకాల పుష్పాలు ఆభరణాలతో అలంకరించి సహస్రనామార్చన, ఆస్థాన సేవ నిర్వహించారు. అనంతరం మేళతాళాలు మంగళవాయిద్యాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, ప్రాకారోత్సవం (ప్రదక్షిణలు) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కౌలుకు భూముల వేలం

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి చెందిన మాగాణి భూముల కౌలు వేలం పాటను శుక్రవారం నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఈఓ తాతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేలం పాటలో గ్రామానికి చెందిన వ్యక్తి 5.14 ఎకరాల భూమిని మూడేళ్లపాటు కౌలు హక్కులను పొందారు. ఇందుకు గాను ఏడాదికి రూ.75 వేల చొప్పున కౌలు లీజు దేవదాయశాఖకు కట్టేలా ఒప్పందం కుదిరింది.

శాంతిభద్రతలను పరిరక్షిస్తాం


చెంచుబాబు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతామని నాయుడుపేట డీఎస్పీ జి.చెంచుబాబు పేర్కొన్నారు. నాయుడుపేట డివిజన్ నూతన డీఎస్పీగా ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన శ్రీనివాసరెడ్డి రిలీవ్ అయ్యి గుంటూరు రేంజ్ కార్యాలయానికి వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీని డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట పోలీస్ సర్కిల్ కార్యాలయాలతో పాటు తడ, దొర వారిసత్రం, పెళ్లకూరు, ఓజిలి మండలాల పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించి పలు విషయాలను డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

చిల్లకూరు: గ్రామ పంచాయతీలలో అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ భానుమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండో రోజైన శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో సర్పంచ్‌లు, కార్యదర్శులు తమ వంతుగా గ్రామాలలో ఎలాంటి పనులు చేపడితే ఆర్థిక అభివృద్ధి సాధించగలమనే విషయాలపై చర్చించుకుని ముందుకు సాగాలన్నారు. ఇంటి పన్ను వసూలు, పరిశ్రమల నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాణిక్యం, శిక్షకులు గురుడయ్య, జమీర్‌బాషా, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు తహసీల్దార్‌గా చంద్రశేఖర్



గూడూరు రూరల్: గూడూరు మండల తహసీల్దార్‌గా ఎస్.చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో పని చేస్తున్న చంద్రశేఖర్‌ను సాధారణ బదిలీలలో భాగంగా గూడూరుకు బదిలీ చేశారు. గతంలో ఈయన సైదాపురం, చిట్టమూరు మండలాల్లోనూ పని చేసి ఉండడంతో ఈ ప్రాంతానికి సుపరిచితుడు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటామని అన్నారు.

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు

నాయుడుపేట టౌన్: శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు జరిపి ప్రత్యేక పూజలను జరిపారు. పట్టణంలోని గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆలయ పూజరి సురేష్ పట్టుచీరలతో అలంకారం చేపట్టడడంతో భక్తులు బారులు తీరి దర్శించుకున్నారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకారం చేపట్టి పూజలను నిర్వహించారు. తిమ్మాజికండ్రిగ గ్రామంలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న దుర్గామల్లేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారికి గాజులతో లక్ష్మీదేవి అలంకరణ చేపట్టి, పూజలు జరిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆరోగ్య వైద్యశాలలో మనులాలాపేటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నెల్లూరు సుశీల నేత్రాలయ వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంప్లాయిస్ పెన్షనర్స్, ఈహెచ్ఎస్ హెల్త్‌కార్డు కలిగిన వారికి ఉచితంగా శుక్లం ఆపరేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలియజేశారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి


భోజనం ప్యాకెట్లు అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

గూడూరు రూరల్: గర్భవతిగా ఉన్న ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని గూడూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం పట్టణానికి చెందిన సూర్య ఫ్యాన్సీ అధినేత వేణుగోపాల్ సమకూర్చిన భోజనాలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మంచి పౌష్టికాహారం తీసుకుని, సుఖ ప్రసవం అయ్యేలా చూసుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం లోకల్ ఛానల్ మీడియా రిపోర్టర్ సచిన్‌కు జ్ఞాపికను అందించారు. జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, రామ్మోహన్, విజయబాబు, సుమన్‌రెడ్డి, రజని, సాయి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమంలోని వృద్ధులకు చేయూత


ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం

నాయుడుపేట టౌన్: ప్రముఖ సినీ హీరో మహేష్ బాబు జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు శుక్రవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పలు చోట్ల కేక్‌లు కట్ చేసి అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమాల్లోని వారికి పంచి పెట్టారు. మేరీ వృద్ధుల ఆశ్రమంలో బిరియానీ ప్యాకెట్లు, ఇతర నిత్యావసరాలు అందించారు. నాయుడుపేట మహేష్‌బాబు అభిమాన సంఘం ఈ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఏబీవీపీకి చెందిన చందు, ఇతర మహేష్ అభిమానులు పట్టణంలో పలువురు నిరుపేదలకు ఆహార ప్యాకెట్లు అందించారు. అభిమాన సంఘం నాయకులు ఎస్ఎస్ జెమిని, పునబాక శ్రావణ్ కుమార్, వెంకటేశ్వర్లు, కళ్యాణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి


కేక్ కట్ చేస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

గూడూరు రూరల్: గిరిజన పిల్లలు అన్ని రంగాలలో రాణించాలని సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గూడూరు గాంధీనగర్లోని గిరిజన గురుకుల పాఠశాలలో శుక్రవారం రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజును ఇలా చిన్న పిల్లల మధ్య చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. పిల్లలతో కలసి కేక్ కట్ చేసి అందరికి పంచి పెట్టారు. ఎంఈఓ కాంచన, క్లబ్ అధ్యక్షుడు నాశిన నాగులు, గిరిబాబు, క్రిష్ణ, శివశంకర్, శ్రీనివాసులు, క్రిష్ణంరాజు, బలరామిరెడ్డి, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని వెంకటగిరి రోడ్డు వద్ద కేఎస్ఆర్ సంస్థ సొంత నిధులు రూ.15 లక్షల వ్యయంతో నాయుడుపేట రోటరీ క్లబ్ వారి సారథ్యంలో నిర్మించే బస్ షెల్టర్‌కు శుక్రవారం భూమి పూజ చేశారు. కేఎస్ఆర్ సంస్థ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ నాయకులు కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి కట్టా రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం బస్‌షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దిన్, ఆదవరం నాగూరయ్య, రామ్మోహన్, కృష్ణారావు, ఉదయశంకర్, కళత్తూరు జనార్దన్‌రెడ్డి, డాక్టర్ గోపినాథ్, పెసల హరిబాబు, కేఎస్ఆర్ సంస్థకు చెందిన షేక్ రఫీ, నరేంద్ర యాదవ్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాల నేతలు

వెంకటగిరి రూరల్: రైతులు, అనుబంధ సంఘాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. క్విట్ ఇండియా డే సందర్భంగా పట్టణంలో రైతు కూలీసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. వివిధ సంఘాల నేతలు వీవీ రమణయ్య, బాలకృష్ణయ్య, వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ రైతులు, కార్మికులతోపాటు అన్ని సెక్షన్‌లలో ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన ఎన్నికల హామీ గాలికి వదిలేశారన్నారు. కార్పొరేట్ కంపెనీల సేవలో తరించడంతో నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివకుమార్, ఏఐవైఎఫ్ నాయకులు జయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోరేపల్లిలో ఉచిత పశు వైద్యశిబిరం


జోరేపల్లిలో రైతులకు మందులు పంపిణీ

రాపూరు: జోరేపల్లి గ్రామంలో శుక్రవారం వెటర్నరీ పాలిటెక్నిక్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీహరి మాట్లాడుతూ పశుసంవర్థక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా జోరేపల్లి గ్రామంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గొర్రెలకు నట్టలనివారణ మందులను అందించామన్నారు. పశు సంపద పెంచేందుకు రైతులు తీసకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతకముందు గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. సంక్రాంతిపల్లి పశువైద్యాధికారి సుప్రజ, రాజేష్, కళాశాల సిబ్బంది విశాలి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట: మన్నారుపోలూరు విద్యుత్ సబ్ స్టేషన్, ఇత సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. సూళ్లూరుపేటతోపాటు తడ, దొరవారిసత్రం మండలాల్లో కూడా విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని పాలకేంద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుండి 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ డీఈ మునిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.